# 20. బ్రాహ్మణ్యం

ఉదయం ఏడుగంటలవేళ దాటింది.

కోవిల అరుగుమీద ఒక పక్కకు తిరిగి వినాయకశాస్త్రి పడుక్కున్నాడు. భోక్తలుగా వెళ్లవలసిన వాళ్లు, పౌరోహిత్యం చేయించవలసినవాళ్లు ఆసరికి వెళ్లిపోయారు.

ఒకాయన పంచకట్టుకొని, పొడుగుచేతులచొక్కాతొడుక్కొని వచ్చి అరుగుదగ్గిర నిలబడ్డాడు. ఒక పదినిమిషాలు అతనలా రోడ్డుమీద నిలబడినా వినాయకశాస్త్రి గుర్తించినట్లులేదు. వచ్చిన అతనివేపు తిరగలేదు.

"అయ్యా! మీరేనా వినాయకశాస్త్రి గారు?" వచ్చిన అతను పడుక్కున్న మనిషిని అడిగాడు.

"అవును ఏంకావాలి?" వినాయకశాస్త్రి విసుగ్గా అన్నాడు.

"ఇవాళ మా తల్లిగారి ఆబ్దికం. మీరు..."

"ఏం మనిషివయ్యా నువ్వు! ఒకనెలముందు బుక్‌చేసినా మంత్ర బ్రాహ్మణుడూ, భోక్తలూ దొరకడం కష్టంగా ఉంది. ఉన్నట్లుండి ఊడిపడితే మనుషులను ఎక్కడనుంచి తెస్తాను?"

"నేను నిన్న రాత్రే ఈ వూరు ఒక్కడినీ వచ్చాను. కుటుంబం మరో ఊరులో ఉంది. అందుచేత ముందుగా చెప్పడానికి వీలుపడలేదు."

"ప్రస్తుతానికి మనుసులెవరూలేరు."

రోడ్డు మీద ఆయన నిలుచునే ఉన్నారు.

వినాయకశాస్త్రి గోడవేపు ముఖం తిప్పిపడుక్కునే ఉన్నాడు.

"మీరు తలచుకుంటే తప్పకుండా సహాయం చేయగలరని చెప్పారు."

"నేను కూడా కాళీగాలేను. రెండిళ్ల మంత్రంచదవాలి."

"పోనీ, నాది మూడోది..."

"వెళ్లవయ్యా, వెళ్లు. నేను చెయ్యనంటే చెయ్యను."

వచ్చిన అతని ముఖం విన్నబోయింది.

కాని వినాయకశాస్త్రి అది గుర్తిస్తేకదా!

వచ్చిన అతను మళ్లా మాట్లాడాడు.

"అయిదు సంవత్సరాలయి మా తల్లిగారి ఆబ్దికం భక్తి శ్రద్ధలతో పెడుతూ వచ్చాను. ఈ యేడు అవాంతరం వచ్చింది. దీనికేదేనా ప్రత్యామ్నాయముందా?"

రోడ్డు మీద పోతున్న మరొకాయన ఆగి, వాళ్లిద్దరి మధ్య జరుగుతున్న సంభాషణ వింటున్నాడు.

"ఓ! మహారాజులా ఉంది. స్వయంపాకం తెచ్చిగుళ్లో పూజారికియ్యి. రోజల్లా ఉపవాసముందు."

వచ్చిన ఆయన నిరాశతో వెనుదిరిగినప్పుడు వినాయకశాస్త్రి అటునుంచి యిటు తిరిగాడు.

రోడ్డు మీద నిలుచున్న మూడో ఆయన, తద్దినంపెట్టవలసిన మనిషిని తనతో రమ్మన్నాడు.

ఇద్దరూ సందులోకి వెళ్లిన తరువాత మూడో ఆయన అన్నాడు.

"నేను మీ యిద్దరి మాటలు కొంతవరకు విన్నాను. వినాయకశాస్త్రి మొండివాడు. ఇప్పుడు నాతో మరోసారి వివరాలు చెప్పండి."

రెండవ ఆయన అన్నీ చెప్పాడు.

"నాపేరు మృత్యుంజయశర్మ. మా తండ్రిగారు ఆహితాగ్ని. వారునాకు పౌరోహిత్యం పూర్తిగా నేర్పారు. నేను పెళ్లిళ్లు చేయించగలను. తద్దినాలు పెట్టించగలను. మునిసిపల్ స్కూలు హెడామస్టరుగా పనిచేస్తున్నాను. అందుచేత నేనెప్పుడూ ఈ వినాయకశాస్త్రి వృత్తికి పోటీ చెయ్యలేదు. సాటి బ్రాహ్మణులు మీరు. తల్లిగారి ఆబ్దికం విడిచిపెట్టరానిది. నేను మంత్రం చెప్తాను. భోక్తలను తెస్తాను. ఆబ్దికం పెట్టండి."

"నేను నిన్నరాత్రే ఈవూరు వచ్చాను. ఇంకా యిల్లూవాకిలీ స్థిరపడలేదు."

"మీరేం విచారించకండి. అదుగో అదేమాయిల్లు. నా భార్య మడికట్టుకొని వంట చేస్తుంది. మా స్కూలులో యిద్దరు బ్రాహ్మణుల కుర్రాళ్లు భోక్తలుగా వస్తారు. మాకు ఎనిమిది నుండి పదకుండు వరకు స్కూలు. మీరాసరికి వస్తే సక్రమంగా ఆబ్దికం ......"

ఆ వచ్చిన అతని ముఖంలో చెప్పలేని సంతోషం. అతను జేబులోంచి రెండు నూరు రూపాయలనోట్లు తీసి ఇవ్వబోతుంటే మృత్యుంజయశర్మ పుచ్చుకోలేదు.

"ఖర్చుపెట్టినది తరువాత తీసుకుంటాను. దక్షిణలు లాంఛనప్రాయాలు."

వచ్చిన అతను వంగి మృత్యుంజయశర్మ పాదాలకు నమస్కారంచేసి వెళ్లిపోయాడు, కళ్లుతుడుచుకుంటూ.

.....................................................................

ఉదయం ఆరయేసరికి కోవెల దగ్గిర చాలహడావిడిగా ఉంది. వారం రోజుల కింద కలెక్టరుగారి పి.యే. వినాయకశాస్త్రిని పిలిపించారు. కలెక్టరుగారి చెల్లెలికి ప్రథమ సుపుత్ర జననమయింది. నక్షత్రం మొదలైనవి ఏమీ బాగులేవు. గ్రహజపాలు, రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, నామకరణం, సత్యనారాయణవ్రతం, వేంకటేశ్వరుల దీపారాధన జరిపించాలి. పౌరోహిత్యం చేస్తున్న నలభైమంది బ్రాహ్మణులను వినాయకశాస్త్రి తీసుకొచ్చి పని జరిపించాలి. ఇంకా హెచ్చుమంది తెచ్చినాపరవాలేదు.

వినాయకశాస్త్రి అరవైమంది బ్రాహ్మణులను కోవిల దగ్గిర ఆయత్తం చేశాడు. అందరూ శుచిర్భూతులై స్నానాదులు ముగించి, సంధ్యలువార్చి, తడిపి ఆరవేసిన పొత్తి బట్టలు పింజలు పెట్టి కట్టుకొని సిద్ధంగా ఉన్నారు. ఇంతలో టూరిస్టు బస్సురావడం, అందరూ బిలబిలా అందులోకి ఎక్కడం జరిగింది.

కలెక్టరుగారి బంగళా చాలపెద్దది. హెూమాలకు, పూజలకు, వ్రతానికి చాలవిశాలమైన చాందినీ కింద గొప్ప ఏర్పాటులు జరిగాయి.

కార్యక్రమం పూర్తయేసరికి ఒంటిగంటయింది.

తరువాత సమారాధన.

భోజన పదార్థాలను మడిగా వండించి, బ్రాహ్మణులే వడ్డనచేసే ప్రయత్నాలు చేయమని. కలెక్టరుగారు తమ పి.యే. చతుర్వేదితో ముందుగానే చెప్పారు.

భోజనాలు చాలపెద్ద హాలులో పెట్టిస్తున్నారు.

కాని...

పి.యే. చతుర్వేదిమడిగా వంటలు వండించి, బ్రాహ్మణులనే వడ్డనకు నియోగించినా పద్ధతి మాత్రం పూర్తిగా మారిపోయింది.

కలెక్టరుగారు స్నేహితులతో మాట్లాడుతూ, విభూతిపిండికట్లున్న బ్రాహ్మణుడొకడు అందించిన ప్లేటు, చెమ్చాతీసుకున్నారు.

బఫే పద్ధతిలో సమారాధన జరుగుతున్నది.

కలెక్టరుగారు, మరొకొందరు, వారివెనుక వినాయకశాస్త్రి, అతని బృందం వరుసలో నిలబడి, కావలసిన పదార్థాలు తృప్తితీరా మళ్లా మళ్లా వేయించుకొని భోజనాలు పూర్తి చేశారు.

భోజనాల తరువాత, మరో పెద్ద పందిరికింద, అతిథులు, బ్రాహ్మణులు, బంధువులు అందరూ కూర్చొని తాంబూలాలు సేవిస్తున్నారు.

ఆ సమయంలో ఆచార్య దక్షిణామూర్తిగారు బ్రాహ్మణుల నిత్యకర్మలు, వాటి ప్రాముఖ్యత గురించి ఉపన్యసిస్తూ ఇలా అన్నారు!

"భోజనవిధి పట్లకూడా శ్రోత్రియుడైన బ్రాహ్మణుడు శ్రద్ధ చూపించాలి. భోజనం ముందు పరిషేచనం చేయాలి. ఆపోశనం పట్టాలి. భోజనమైన తరువాత ఉత్తరాపోశనం పట్టి మరీలేవాలి."

ఆ మాటలు విన్న కొంతమంది వినాయకశాస్త్రివేపు, కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్న బ్రాహ్మణులవేపు చూశారు.

ఒక అతిథి ప్రశ్నించాడు.

"శ్రోత్రియబ్రాహ్మణుడు ఇలా చేయకపోతేనేరమేనా?"

"విధిగా నేరం. ఇది ధర్మలోపం."

అందరూ శ్రద్ధగా వింటున్నారు.

"దీనికి శిక్ష కూడా..."

"ఉంటుంది."

ఇంతలో పి.యే. వచ్చి కలెక్టరుగారితో అన్నాడు.

"సార్! ప్రెస్‌వారు మీ సందేశంకోసం పక్క గదిలో వేచియున్నారు."

కలెక్టరుగారు బ్రాహ్మణులందరినీ ఒకసారి పరికించి చూసి అన్నారు.

"చతుర్వేది! నా సందేశాన్ని ముందు పేజీలో పెద్దక్షరాలతో వెయ్యమనండి. 'బ్రాహ్మణ్యం మంటగలిసింది. శ్రోత్రియులైన బ్రాహ్మణులు భోజన విధిని పాటించలేదు. దీనిని నేరంగా పరిగణిస్తున్నాము. నగరంలో పౌరోహిత్యం చేస్తున్న అరవై మంది బ్రాహ్మణులు బఫే విందులో పాల్గొని ఔపోసనం, పరిషేచనం మొదలైనవి చేయలేదు. తెలిసి చేసినా, తెలియకచేసినా, నేరం నేరమే. నిప్పును పట్టుకుంటే చెయ్యికాలుతుంది. శ్రోత్రియులు చేసిన ఈనేరానికి కంచికామకోటి పీఠాధిపతులు శిక్షను నిర్ణయిస్తారు. పీఠాధిపతుల నిర్ణయం ప్రకారం ఆచరించడం జరుగుతుంది. కంచి నుండి జవాబు వచ్చేవరకు ఈ పౌరోహిత్యుల నెవ్వరూ శుభకార్యాలకు పిలవకూడదు."

సభలో పెద్ద సంక్షోభం నెలకొంది.

బ్రాహ్మణుల నుదుటపిండికట్లు చెరిగిపోయాయి.

పింజులు పెట్టికట్టిన పంచలు జారిపోయాయి.

వినాయకశాస్త్రి పరికించి కలెక్టరుగాని వేపు చూశాడు.

ఆ మాటలు, ఆ మనిషి, ఎప్పుడో ఆరునెలల కింద తనను దీనంగా, తల్లిగారి ఆబ్దికం పెట్టించమని వేడుకుంటుంటే...

వినాయకశాస్త్రి కుర్చీలో మరికూర్చోలేకపోయాడు.

ప్రెస్‌వారికి సందేశం తీసుకుపోడానికి పి.యే. లేచారు.

"కలెక్టరు గారు! ముందు మీ పి.యేని ఆపండి." దక్షిణామూర్తిగారు కలెక్టరు గారిని ఆదేశించారు.

"మీరు ప్రెస్సుకి యివ్వమన్న స్టేట్‌మెంట్ చాలదారుణంగా ఉంది. ఈ పౌరోహితు లందరూ శుభకార్యాలు మొదలైనవి చేయించి పొట్టపోసుకుంటున్నారు. సమాజానికి అవసరమైనవాళ్లు. పత్రికలలో మీ ప్రకటనచూసిన తరువాత వీళ్లనందరిని వెలివేస్తారు. ఈ

ప్రవృత్తికి తప్పితే వీళ్లు మరేపనికి సమర్థులుకారు. నేరం చేయడం సామాన్యమైనది. ఉదారంగా మీరు వాళ్లని క్షమించడం చాల గొప్పపని. కలెక్టరుగారు..."

కలెక్టరుగారు వినాయకశాస్త్రిని చూసి ఫకాలునవ్వారు.

"చతుర్వేది! సందేశం మార్చండి. 'మననగరంలోనున్న శ్రోత్రియబ్రాహ్మణ పౌరోహిత్యులందరూ కలిసికట్టుగా వచ్చి తమయింట బాలసార మహోత్సవం చాలఘనంగా జరిపించినందుకు కలెక్టరుగారు వారికందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు."

అందరి ముఖాలలోను స్వచ్ఛమైన ఆనందం వెల్లివిరిసింది.